మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టాలని ఉందా?
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?
సంచలన కథనాలకు కేరాఫ్ గా నిలిచిన
ఇది కద నిజం
తెలుగు దినపత్రిక
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
జిల్లా ఇన్చార్జులు మరియు విలేకరులు కావలెను
మా ప్రత్యేకతలు:
నిజం మా ఆయుధం..
ప్రజలే మా బలం...
మీ ప్రాంత సమస్యలను మా దృష్టికి తీసుకురండి...
ప్రజా గొంతుకగా కలిసి పోరాం!
6300490170, 9848983329
www.edikadanijam.com
నిజం కోసం.. సమాజం కోసం.. ఇది కద నిజం..

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

పేజీలు :4 వెల :2 సంపుటి :02 సంచిక :147 www.edhikadhanijam.com ఎడిటర్ : బాలరాజు గౌడ్

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టాలని ఉందా?
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?
సంచలన కథనాలకు కేరాఫ్ గా నిలిచిన
ఇది కద నిజం
తెలుగు దినపత్రిక
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
జిల్లా ఇన్చార్జులు మరియు విలేకరులు కావలెను
మా ప్రత్యేకతలు:
నిజం మా ఆయుధం..
ప్రజలే మా బలం...
మీ ప్రాంత సమస్యలను మా దృష్టికి తీసుకురండి...
ప్రజా గొంతుకగా కలిసి పోరాం!
6300490170, 9848983329
www.edikadanijam.com
నిజం కోసం.. సమాజం కోసం.. ఇది కద నిజం..

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త బాస్!

- తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి
- మీనాక్షి నటరాజన్‌కు బదులుగా సందీప్ కుమార్
- సందీప్ నియామకానికి ఖర్గే ఆమోదం
- ఉన్నత చదువుల కోసం లండన్‌కు మీనాక్షి
- పార్టీ సంస్థాగత బాధ్యతలు కొత్త ఇన్‌ఛార్జికి
- మహారాష్ట్ర, గుజరాత్‌లో పనిచేసిన అనుభవం
- సందీప్ నియామకంపై మహేశ్ గౌడ్ హర్షం

2 లో

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన ఏఐసీసీ కార్యదర్శి బీఎం సందీప్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన మీనాక్షి నటరాజన్ స్థానంలో ఆయనకు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఉన్నత చదువుల కోసం మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్లడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నియామకానికి ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు సందీప్ కుమార్ చేతుల్లోకి వెళ్లాయి.

తనిష్క్ దోపిడీలో యూట్యూబర్ అరెస్ట్!

- రూ.31 కోట్ల నగల చోరీలో ట్విస్ట్
- దోపిడీ కేసులో మీనాక్షి అరెస్ట్
- పొలంలో పాతిపెట్టిన బంగారం స్వాధీనం
- నిషాంత్ కోసం 9 పోలీసు బృందాల గాలింపు
- స్నేహితురాలి కోసమే భారీ దోపిడీ?
- నిందితుడికి తండ్రి సహకారం.. అరెస్ట్
- 6 కిలోల బంగారు, వజ్రాభరణాల రికవరీ

2 లో

మా డోర్ అల్లా చేతిలో.. మీది బీజేపీ చేతిలో!

- అఖిలేష్‌కు ఒవైసీ ఘాటు కౌంటర్
- బీజేపీ చేతిలో మీ డోర్: ఒవైసీ
- అఖిలేష్ ద్వంద్వ నీతిపై ఒవైసీ ఫైర్
- ఎర్ర టోపీ నేతలపై ఒవైసీ సెటైర్లు
- రాజ్యసభ ఎంపికపై అఖిలేష్‌కు ప్రశ్నలు
- అఖిలేష్‌పై ఒవైసీ విమర్శల దాడి

2 లో

కాళ్లు మొక్కుతారా.. చెప్పులు మోస్తారా?

2 లో

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నాయకుల ప్రవర్తన పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఢిల్లీ అగ్రనేతల ముందు రాష్ట్ర నాయకులు వ్యవహరిస్తున్న తీరు పదవుల గౌరవాన్ని దిగజార్చేలా ఉందని ఆక్షేపిస్తూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

2 లో

రాహుల్ సభకు జనం కరువు

- రాహుల్ సభకు జనం కరువు.. మంత్రుల అసహనం
- జనసమీకరణ బాధ్యతలపై నేతల మధ్య అసంతృప్తి
- నగర ఎమ్మెల్యేలున్నా కనిపించని పార్టీ కేడర్
- ముందే చెబితే జనాలను తరలించేవాళ్లం
- జనం పలుచగా ఉండటంతో రాహుల్ ప్రసంగం కట్
- ఐదు లక్షల మందికి కార్యక్రమం.. తీరా నిరాశే!
- వాయిదాల మీద వాయిదాలు.. చివరకు వెలవెలబోయిన సభ
- వేదికపైకి వెళ్లకుండా మంత్రులకు అడ్డంకులు
- జాతీయ నేత సభలోనూ సమన్వయ లోపం బట్టబయలు

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యే కార్యక్రమానికి ఇదేనా సమీకరణ అంటూ గిగ్ వర్కర్ల కార్యక్రమంపై మంత్రులు పెదవి విరిచారు. 'రాహుల్ కొద్ది సేపే ప్రసంగించారు ఏంటి సార్'.. అంటూ భారత్ సమ్మిట్ జరిగే హెచ్ఐసీసీ వద్ద ఒక దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రిని మీడియా ప్రతినిధులు అడుగగా.. 'రాహుల్ జనాలు, వారి మూడ్‌ను బట్టి మాట్లాడుతారు.. మేము ఆయనను చాలాసార్లు చూశాం.. తక్కువ సంఖ్యలో జనాలు ఉంటే మాట్లాడటానికి అంతగా ఆసక్తి చూపరు. వారికి తగ్గట్లుగానే మాట్లాడుతారు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

స్టార్‌షిప్ ప్రయోగం పాక్షిక విజయం

- కక్ష్యలోకి 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలు
- సముద్రంలో పేలిపోయిన సూపర్ హెవీ బూస్టర్
- ల్యాండింగ్‌లో విఫలమైన స్పేస్ఎక్స్
- స్టార్‌షిప్‌ను పట్టుకునేందుకు భారీ ఏర్పాట్లు
- 2028 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములు
- ప్రయోగాల కోసం మళ్లీ వాడుకునేలా ప్లాన్
- బూస్టర్ వైఫల్యంతో లక్ష్యానికి ఆటంకాలు

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ఎక్స్ సంస్థ చేపట్టిన 'స్టార్‌షిప్' అంతరిక్ష ప్రయోగం పాక్షిక విజయాన్ని సాధించింది. శుక్రవారం సౌత్ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుండి నింగిలోకి దూసుకెళ్లిన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఈ 124 మీటర్ల రాకెట్, తన ప్రధాన లక్ష్యమైన స్టార్‌లింక్ నెట్‌వర్క్ కోసం 26 ఉపగ్రహాలను విజయవంతంగా భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అయితే, ప్రయోగం తర్వాత రాకెట్ కింది భాగమైన 'సూపర్ హెవీ బూస్టర్'ను తిరిగి లాంచ్ ప్యాడ్ వద్ద సురక్షితంగా పట్టుకోవాల్సిన లక్ష్యం విఫలమైంది. తిరుగు ప్రయాణంలో బూస్టర్ నిర్దేశిత మార్గం నుండి పక్కకు మళ్లి, గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్ర ఉపరితలంపై పేలిపోయింది.

2 లో

సజ్జనార్‌పై ఆరోపణలు.. సీఎంకు ఫిర్యాదు!

- సజ్జనార్‌పై రాజాసింగ్ సంచలన లేఖ
- గోల్డ్ చోరీ కేసులో పురోగతి ఏది?
- ఫోన్ ట్యాపింగ్‌లో సజ్జనార్ పాత్రపై ఆరా
- హామీవే కేసుపై స్వతంత్ర విచారణ
- సజ్జనార్ ఆస్తులపై విచారణ జరపాలి
- జ్యుడీషియల్ విచారణకు రాజాసింగ్ డిమాండ్
- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కీలక లేఖ

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పదవీ కాలంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలు, పెండింగ్ కేసులపై స్వతంత్ర సీబీఐ విచారణ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జనార్దన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సజ్జనార్ చేసిన ఇటీవలి ట్వీట్ తర్వాత ఆయన ప్రవర్తన పై పలు ప్రశ్నలు, అనుమానాలు...

2 లో

రాజస్థాన్ పేలుడు వెనుక పాక్ హస్తం!

- పంజాబ్‌లో ఇద్దరి అరెస్ట్
- 'షా' ఆదేశాలతో విధ్వంసానికి ప్లాన్
- రైల్వే ట్రాక్‌పై ఐఈడీ అమరిక
- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- పాక్ ఉగ్ర నెట్‌వర్క్‌పై ఆరా

2 లో

మోదీతో రేవంత్ కీలక భేటీ!

- తెలంగాణకు రూ.30 వేల కోట్ల సాయం
- సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు
- తుమ్మిడిహెట్టికి కేంద్రం సహకారం
- గోదావరి-కావేరి అనుసంధానంపై ప్రతిపాదన
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం
- ఖేలో ఇండియా గేమ్స్‌కు రావాలని ఆహ్వానం
- తెలంగాణ నీటి వాటాపై విజ్ఞప్తి

2 లో

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఢిల్లీలోని ప్రధాని నివాసం లోక్ కల్యాణ్ మార్గ్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, కేంద్ర నిధుల కేటాయింపు వంటి అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అవసరాలను వివరిస్తూ పలు కీలక వినతులు సమర్పించారు. ముఖ్యంగా రైతులను ఆదుకోవడంతో పాటు కరువు నివారణ చర్యల కోసం కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల తక్షణ ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడి పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీటి అవసరాలపై కరువు ప్రభావం పడుతోందని వివరించారు. రైతులను ఆదుకోవడానికి, కరువు నివారణ చర్యలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణకు అక్వాన్ తుఫాన్ ముప్పు

- ఆరు జిల్లాలకు భారీ వర్ష సూచన
- 20 నుంచి 22 వరకు వర్షాలు
- ఖమ్మం, నల్గొండకు అలర్ట్
- తుఫాన్‌తో మారనున్న వాతావరణం
- రైతులకు వాతావరణ హెచ్చరికలు
- ధాన్యం కొనుగోళ్లపై తుఫాన్ ప్రభావం

2 లో

ఇది కద నిజం

రాజస్థాన్ పేలుడు వెనుక పాక్ హస్తం!

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో రైల్వే ట్రాక్‌పై బాంబ్ పేలిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి 21 ఏళ్ల యువతి మహక్‌దీర్ కౌర్, ఆమె సహచరుడు 23 ఏళ్ల దేవేంద్ర సింగ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్ల ప్రేమ సంబంధం కారణంగా యువతి ఈ టెర్రర్ నెట్వర్క్‌లో చేరారనే అనుమానంతో దర్యాప్తు చేస్తున్నారు. ఈ పేలుడుకు పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తుల ప్రమేయం, నిధులు, ఇతరుల పాత్రపై భద్రతా సంస్థలు దర్యాప్తు ప్రారంభించాయి.

నవంబర్ 3న శ్రీగంగానగర్ జిల్లాలోని అనూప్‌గఢ్--సూరత్‌గఢ్ రైల్వే మార్గంలో ఈ పేలుడు సంభవించింది. రాజస్థాన్ ఏటీఎస్, శ్రీగంగానగర్ పోలీసులు, పంజాబ్ పోలీసులు ఈ ఘటనపై సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు. పంజాబ్ గురుదాస్‌పూర్‌కు చెందిన మహక్‌దీర్ కౌర్, దేవేంద్ర సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పేలుడులో యువతికి దేవేంద్ర సింగ్ సహకరించినట్లు అనుమానిస్తున్నారు.

ఐఎస్ఐ ఏజెంట్‌తో ప్రేమ..

విచారణలో.. మహక్‌దీర్ కౌర్‌కు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయం ఉన్నట్లు తేలింది. షా, చాచా అనే కోడ్ పేర్లు కలిగినవారితో పరిచయం ఏర్పడిందని, నిందితురాలు వీరితో సంభాషణలు జరిపినట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. ఒక ఐఎస్ఐ ఏజెంట్‌తో మహక్‌దీప్ ప్రేమ సంబంధంలో ఉందని, దీనిని ఆసరాగా చేసుకుని ఆమెను ఈ నెట్వర్క్‌లోకి లాగినట్లు అనుమానిస్తున్నారు. ఆమె భర్త ప్రస్తుతం డ్రగ్స్ కేసులోల జైలులో ఉన్నాడు. భర్త నుంచి విడిపోయి ఉంటున్న మహక్‌దీప్ ఒంటరితనాన్ని ఉపయోగించుకుని టార్గెట్ చేసిరా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

గతంలో రాజస్థాన్‌లో గంగాపూర్ సిటీలో జరిగిన మరో కేసులో ఈమెకు సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో బబిత అనే మహిళను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అరెస్ట్ చేసింది. పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తులతో ప్రేమ సంబంధం ద్వారా ఆమె పరిచయం పెంచుకున్నట్లు అప్పట్లో దర్యాప్తు అధికారులు తేల్చారు. ఈ రెండు కేసుల్లో ఒకే తరహా విధానాన్ని టెర్రర్ నెట్వర్క్ అమలు చేస్తుందా? అని భద్రతా సంస్థలు విచారణ చేపట్టాయి.

పిస్టళ్లు, తూటాలు స్వాధీనం..

మహక్‌దీప్ కౌర్ వద్ద నుంచి రెండు విదేశీ పిస్టళ్లు, 46 లైవ్ కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రాజస్థాన్ ఏటీఎస్ వెల్లడించింది. అలాగే రూ.30 వేల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ట్రాక్‌పై పేలుడు ఆపరేషన్ నిర్వహించేందుకు ఈ డబ్బు ఇచ్చి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

మోదీతో రేవంత్ కీలక భేటీ!

మొదటి పేజీ తరువాయి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని కోరినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన కేంద్ర అనుమతులు, నిధులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇప్పించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) వచ్చేలా సహకరించాలని కోరారు. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

గోదావరి-కావేరి నదుల అనుసంధానం అంశం కూడా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ అనుసంధానం ద్వారా తరలించే నీటిలో తెలంగాణకు 50 శాతం వాటా కేటాయించాలని కోరినట్లు సమాచారం. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా కేంద్రం సహకరించాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న అంతర్రాష్ట్ర సమస్యలను ప్రధానికి ముఖ్యమంత్రి, మంత్రులు వివరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తెలంగాణలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించనున్నారు. అదే సమయంలో డిసెంబర్ 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని కూడా ప్రధాని మోదీని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధికి ఈ పోటీలు దోహదపడతాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

ప్రధాని మోదీతో సమావేశం తర్వాత కూడా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకం బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ లాయర్ సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌లో కూడా పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలతోనూ సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

తనిష్క్ దోపిడీలో యూట్యూబర్ అరెస్ట్!

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడులోని మదురైలో ఇటీవల కొత్తగా ప్రారంభమైన తనిష్క్ జ్యువెలరీ షోరూమ్‌లో జరిగిన భారీ దోపిడీ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రముఖ యూట్యూబర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ మీనాక్షి (మీనాక్షి నాచియార్)తో పాటు ప్రధాన నిందితుడు నిషాంత్ తండ్రి సురేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు మదకుళం చెరువు సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గోనె సంచుల్లో పాతిపెట్టిన సుమారు 5 నుంచి 6 కిలోల బంగారు, వజ్రాభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, యూట్యూబర్ నిషాంత్ కోసం 9 ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు

మదురై బైపాస్ రోడ్డులోని పలంగనాథం వద్ద కొత్తగా తెరిచిన తనిష్క్ షోరూమ్‌లో నవంబర్ 12 తెల్లవారుజామున ఈ భారీ దోపిడీ జరిగింది. సుమారు 10 కిలోల బంగారం, ఒక కిలో వజ్రాభరణాలు (మొత్తం విలువ దాదాపు రూ. 25 నుంచి రూ. 31 కోట్ల వరకు ఉంటుందని అంచనా) చోరీకి గురయ్యాయి. ప్రధాన నిందితుడు నిషాంత్ దోపిడీకి ముందు మూడుసార్లు కస్టమర్ వేషంలో షోరూమ్‌కు వచ్చి రెక్కీ నిర్వహించినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. షోరూమ్‌కు ఇంకా పూర్తిస్థాయి లాకర్ సదుపాయం లేకపోవడం, రాత్రివేళ యాంటీ-బర్గ్లరీ అలారం ఆన్ చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నిషాంత్ భవనం వెనుక ఉన్న స్కాఫోల్డింగ్ సాయంతో టెర్రస్ మీదుగా లిఫ్ట్ షాఫ్ట్ ద్వారా లోపలికి ప్రవేశించి నగలు ఎత్తుకెళ్లాడు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన స్నేహితురాలు మీనాక్షి కోసమే నిషాంత్ ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ తర్వాత కొంత బంగారాన్ని మదకుళం సమీపంలోని పొలంలో పాతిపెట్టి, మరికొంత బంగారంతో నిషాంత్ పరారయ్యాడు. దోపిడీ సమయంలో ధరించిన దుస్తులను తగలబెట్టి సాక్ష్యాలను మాయం చేయడంలో నిషాంత్ తండ్రి సురేశ్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఆటోరిక్షా ప్రయాణం, పశువుల కాపరి ఇచ్చిన సమాచారం, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు మీనాక్షి, సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరచగా, నవంబర్ 29 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిషాంత్ చివరి లొకేషన్ తిరుప్పూర్‌లో ట్రేస్ అయిందని, అతడిని పట్టుకుంటే మిగిలిన నగలు కూడా రికవరీ అవుతాయని మదురై పోలీస్ కమిషనర్ ఎస్. రాజేంద్రన్ తెలిపారు.

తెలంగాణకు అక్వాన్ తుఫాన్ ముప్పు

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుఫాను కారణంగా తెలుగు రాష్ట్రాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను ప్రభావంతో ఈ నెల 20వ తేదీన ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో వాతావరణం పూర్తిగా మారిపోయి వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ముఖ్యంగా ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని తూర్పు మరియు దక్షిణ జిల్లాలలో వాతావరణం మారుతుందని, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ అలాగే నాగర్ కర్నూల్ జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు వెలువడ్డాయి. ఇదే విధంగా ఈ నెల 21, 22 తేదీలలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో కూడా తుఫాను ప్రభావం కొంతవరకు కనిపించే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాలలో ఆకాశం మేఘావృతమై ఉండి కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో, ఈ తుఫాను రాకతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్రంలో వరి కోతలు, ధాన్యం కొనుగోళ్ల దశ కొనసాగుతున్నందున, ఈ వర్ష సూచన నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అకస్మాత్తుగా మారే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగు ముందస్తు రక్షణ చర్యలు పాటించడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

మా డోర్ అల్లా చేతిలో.. మీది బీజేపీ చేతిలో!

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): త్వరలో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీపై అఖిలేష్ యాదవ్ చేసిన 'గాలిపటం డోర్' వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఎంఐఎంను ఉద్దేశించి గతంలో అఖిలేష్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "'డోర్ (దారం) ఎంతవరకు వదిలితే వారు అంతవరకే ఎగురుతారు.. మేము డోర్ లాగినప్పుడు కిందకు దిగాల్సిందే' అని అఖిలేష్ అన్నారు. అఖిలేష్ యాదవ్ గారూ.. మా 'డోర్', మా తలరాత అల్లా చేతిలో ఉందని ముస్లింలు నమ్ముతారు. మీరు తీవ్రమైన భ్రమలో ఉన్నారు మిత్రమా.. నిజానికి మీ 'డోర్' మాత్రం బీజేపీ చేతిలో ఉంది" అని అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు.

రాజ్యసభ ఎంపీ నియామకంపై నిలదీత

అఖిలేష్ యాదవ్ రాజకీయ ద్వంద్వ నీతిని ఎండగడుతూ ఒవైసీ పలు ప్రశ్నలు సంధించారు. "అఖిలేష్ యాదవ్ ఎవరిని రాజ్యసభ ఎంపీగా నియమించారు? జార్ఖండ్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి అభ్యర్థిని ఓడించిన వ్యక్తి కుమారుడిని ఆయన ఎంపిక చేశారు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉంటూ, బీజేపీ మద్దతుదారుగా ఉన్న వ్యక్తి కుమారుడిని అఖిలేష్ సాదరంగా ఆహ్వానించి పదవి ఇచ్చారు" అని ఒవైసీ ఆరోపించారు.

'ఎర్ర టోపీ'పై వ్యంగ్యాస్త్రాలు

తమ పార్టీపై మీడియా చూపే వైఖరిని కూడా ఒవైసీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మా పార్టీలోని ఒక సాధారణ కార్యకర్త తండ్రికి బీజేపీతో సంబంధం ఉండి ఉంటే, పొద్దున్న నుంచి రాత్రి వరకు మీడియా మొత్తం మమ్మల్ని వెంటాడేది. నిజం చెప్పాలంటే, నా సొంత మామగారు కూడా నాపై అంత 'ప్రేమ' చూపించరు, కానీ మీడియా నాపై అంత ప్రేమ కురిపిస్తుంది. మరి ఇప్పుడు ఆ 'ఎర్ర టోపీ' (సమాజ్‌వాదీ పార్టీ) నేతలను అడగండి.. బీజేపీ మద్దతుదారుల కుటుంబాలతో ఇదేం ప్రేమ? ఈ బంధం ఏమిటి?" అంటూ మీడియాపై, అఖిలేష్ యాదవ్‌పై అసదుద్దీన్ ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

గ్యారేజ్‌లో అగ్నిబీభత్సం.. ఐదు బస్సులు స్వాహా!

న్యూస్ డెస్క్, 15 నవంబర్ (ఇది కద నిజం): దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బౌరంపేట బొడ్రాయి సమీపంలోని ఒక గ్యారేజ్‌లో పార్క్ చేసి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మొత్తం ఐదు బస్సులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. గ్యారేజ్‌లో బస్సులన్నీ పక్కపక్కనే పార్క్ చేసి ఉండటంతో మంటలు ఒకదానికొకటి వేగంగా వ్యాపించాయి. ప్రమాద స్థలానికి అతి సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని చుట్టుపక్కల ప్రజలు బెంబేలెత్తిపోయారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గ్యారేజ్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్లే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త బాస్!

మొదటి పేజీ తరువాయి మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ 2025 ఫిబ్రవరి 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. అయితే, ఈ ఏడాది జూన్‌లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేయగా.. తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను వెల్లడించలేదన్న కారణంతో రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ పరిణామాల అనంతరం ఆమె పార్టీ బాధ్యతల నుంచి విరామం తీసుకున్నారు. క్లైమేట్ ఛేంజ్ అండ్ సస్టెయినబుల్ పాలసీ అంశంపై యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో కోర్సు చేసేందుకు సెప్టెంబరు 15న లండన్‌కు వెళ్లారు. అప్పటి నుంచి తెలంగాణకు కొత్త ఇన్‌ఛార్జిని నియమిస్తారనే ప్రచారం మొదలైంది. ఈ పదవి కోసం పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. చివరకు అనూహ్యంగా బీఎం సందీప్‌కు మార్‌కు అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది.

తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా 2023 నుంచి ఇప్పటివరకు నలుగురు నేతలు బాధ్యతలు నిర్వహించారు. 2023 జనవరి నుంచి అదే ఏడాది డిసెంబరు వరకు మహారాష్ట్రకు చెందిన మాణిక్‌రావ్ ఠాక్రే ఈ పదవిలో ఉన్నారు. అనంతరం పశ్చిమబెంగాల్‌కు చెందిన దీపాదాస్‌మున్షీ 2025 ఫిబ్రవరి వరకు బాధ్యతలు చూశారు. ఆమె తర్వాత మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. తాజాగా సందీప్ కుమార్‌కు అవకాశం దక్కింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వానికి-పార్టీకి మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సంబంధాలు వంటి అంశాలను కొత్త ఇన్‌ఛార్జి పర్యవేక్షించనున్నారు.

ఎవరీ బీఎం సందీప్‌కుమార్?

కర్ణాటకలోని చిక్కమగళూరు సందీప్‌కుమార్ స్వస్థలం. కాంగ్రెస్ పార్టీలో వివిధ సంస్థాగత బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేసిన అనుభవం ఉంది. గతంలో మహారాష్ట్ర, గుజరాత్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కర్ణాటక విభాగం ఛైర్మన్‌గా, ఆ సంస్థ జాతీయ కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఈ అనుభవంతో తెలంగాణలో పార్టీ వ్యవహారాలను ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జిగా నియమితులైన బీఎం సందీప్ కుమార్‌కు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

స్టార్‌షిప్ ప్రయోగం పాక్షిక విజయం

మొదటి పేజీ తరువాయి ఈ ల్యాండింగ్ విఫలమవడానికి గల ఖచ్చితమైన కారణాలు వెంటనే తెలియరాలేదని స్పేస్‌ఎక్స్ ప్రతినిధి డాన్ హుయోట్ వెల్లడించారు. బూస్టర్ పేలిపోయినప్పటికీ, రాకెట్ పై భాగమైన స్టార్‌షిప్ అంతరిక్ష నౌక ప్రస్తుతం కక్ష్యలో సురక్షితంగా కొనసాగుతోంది. ప్రణాళిక ప్రకారం, అంతరిక్ష నౌక శనివారం(భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2:50 గంటలకు) భూమికి తిరిగి రానుండగా, లాంచ్ ప్యాడ్‌పై ఉన్న భారీ మెకానికల్ ఆర్మ్స్ ద్వారా గాల్లోనే ఒడిసిపట్టుకునేందుకు స్పేస్‌ఎక్స్ సిద్ధమైంది. భూమికి తిరిగి వస్తున్న ఒక అంతరిక్ష నౌకను ఇలా పట్టుకోవడానికి ప్రయత్నించడం చరిత్రలో ఇదే మొదటిసారి. గత 14 ప్రయోగాల్లో పై దశ నౌకలన్నీ సాంకేతిక లోపాల వల్ల సముద్రంలోనే కూలిపోగా, ఈసారి దానిని సురక్షితంగా వెనక్కి రప్పించి భవిష్యత్తు ప్రయోగాలకు మళ్లీ వాడుకోవాలని సంస్థ ఆశిస్తోంది.

2028 నాటికి చంద్రునిపైకి లక్ష్యం

అంతరిక్ష ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గించాలంటే రాకెట్‌లోని రెండు భాగాలను (బూస్టర్, అప్పర్ స్టేజ్) పూర్తిగా పునర్వినియోగించుకోవడం స్పేస్‌ఎక్స్‌కు అత్యంత కీలకం. ప్రస్తుతం వాడుతున్న చిన్న ఫాల్కన్ రాకెట్ల రెండో దశను తిరిగి పొందే అవకాశం లేనందున, భవిష్యత్ అవసరాల కోసం మస్క్ స్టార్‌షిప్‌పైనే భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం నాసా నుండి బిలియన్ల డాలర్ల నిధులు అందగా, స్పేస్‌ఎక్స్ సొంతంగా కనీసం 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.40 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టింది. 2027 ప్రారంభం నాటికి వారానికి ఒక స్టార్‌షిప్ ప్రయోగం నిర్వహించాలని, 2028 నాటికి వ్యోమగాములను చంద్రునిపైకి పంపాలని మస్క్ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, తాజా బూస్టర్ వైఫల్యం వంటి సాంకేతిక సవాళ్లు ఈ షెడ్యూల్‌ను కొంత ఆలస్యం చేసే అవకాశం ఉంది.

కాళ్లు మొక్కుతారా.. చెప్పులు మోస్తారా?

మొదటి పేజీ తరువాయి అందులో " తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల్లో తమ పదవులకు ఉండాల్సిన హుందాతనం, గౌరవం కరువయ్యాయని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని దిగజార్చేలా వారి ప్రవర్తన ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాహుల్ గాంధీ బైక్ వెంట మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పనివాళ్లలా పరుగులు తీయడం అవమానకరమని వ్యాఖ్యానించారు.

అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాళ్లు మొక్కుతూ, ఆయన చెప్పులు మోసుకెళున్న కేంద్ర మంత్రి మరియు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి తీరును కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటు, అవమానకరమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జాతీయ పార్టీల నేతల వ్యవహార శైలి ఉందని, ఆ ఆత్మగౌరవ విలువ ఈ రెండు జాతీయ పార్టీలకు ఎప్పటికీ అర్థం కాదని ఆయన స్పష్టం చేశారు.

సజ్జనార్‌పై ఆరోపణలు.. సీఎంకు ఫిర్యాదు!

మొదటి పేజీ తరువాయి

మరింత బలపడ్డాయని రాజా సింగ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఆయన హయాంలో జరిగిన కొన్ని దర్యాప్తుల పారదర్శకత, నిష్పక్షపాతతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

అలాగే సజ్జనార్ పదవీకాలంలో నమోదైన గోల్డ్ తెఫ్ట్ (బంగారం చోరీ) కేసులో ఎలాంటి గణనీయమైన పురోగతి లేదని, ఇప్పటివరకు అరెస్టులు ఎందుకు జరగలేదని రాజా సింగ్ ప్రశ్నించారు. దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడానికి, వాస్తవాలను తొక్కు పెట్టడానికి ఏవైనా ప్రయత్నాలు జరిగాయా అనేది తేల్చాలని రాజాసింగ్ కోరారు. అలాగే ఆయన హయాంలో నమోదైన హామ్‌వే కేసులో కూడా తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, దర్యాప్తులో ఆశించిన పురోగతి లేదని లేఖలో ఎత్తిచూపారు.

ఈ కేసు విచారణలో జాప్యానికి గల కారణాలను స్వతంత్రంగా పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం దర్యాప్తు దారి మళ్లిందనే తీవ్ర ఆందోళనలు ఉన్నాయని రాజా సింగ్ పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరోపణలు, ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ విచారణ పురోగతిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అప్పటి సీపీ సజ్జనార్ పాత్రపై కూడా స్వతంత్ర విచారణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు ఇటీవల సజ్జనార్‌పై తీవ్రమైన బహిరంగ ఆరోపణలు చేశారని, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించిన విషయాన్ని రాజా సింగ్ గుర్తు చేశారు. సజ్జనార్ కర్ణాటకలోని తన స్వగ్రామం, దాని పరిసరాల్లో సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వనరులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎమ్మెల్యే రాజా సింగ్ తన లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

రాహుల్ సభకు జనం కరువు

మొదటి పేజీ తరువాయి అక్కడేం (గిగ్ వర్కర్ల సభ) జనాలు ఉన్నరు.. అంటూ తన అసంతృప్తిని బహిరంగంగానే వెల్లడించారు. జాతీయ స్థాయి నేత వచ్చినప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి అంటూ చురుకలు అంటించారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడినా.. సభ మూడ్‌ను చూసి మాట్లాడుతారని, బహిరంగసభలు, సభలకు వెళ్లినప్పుడు ఎక్కువ సంఖ్యలో ఉంటే వారికి మాట్లాడాలనే ఉత్సాహం ఉంటుందని గత అనుభవాలను మంత్రి గుర్తు చేశారు.

మాకు చెప్పినా రప్పించేవాళ్లం..

శనివారం ఉదయం శిల్పారామం నుంచి జయభేరి స్థలం వరకు గిగ్ వర్కర్ల ర్యాలీ అనంతరం సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను సంబంధిత శక్తి శాఖ మంత్రి వివేక్‌కు అప్పగించారు. గత వారంరోజులుగా ఇదే పనిలో ఉన్నారు. అన్ని బాధ్యతలు ఆ శాఖ మంత్రికి, అధికారులకు అప్పగించారు. పార్టీ పరంగా మంత్రితో కలిసి పీసీసీ అధ్యక్షులు పరిశీలించారు. అయితే చివరికి కార్యక్రమం వరకు వచ్చేసరికి ఇలా కావడం ఏంటని వారందరూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం పూర్తి కాగానే హెచ్ఐసీసీ దగ్గరికి నలుగురు మంత్రులు, పార్టీ కీలక నేతలు ముచ్చటించుకుంటూ... తమకు చెప్పినా.. నగరంలో పార్టీకి ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల నుంచి అయినా పార్టీ కేడర్ అయినా తీసుకు వచ్చేవాళ్లమని, నియోజకవర్గానికి కనీసం 500 మందిని తీసుకవచ్చినా భారీగా జనాలు అయ్యే వారని, గిగ్ వర్కర్స్?చెందిన యజమానుల నుంచి తాము తెప్పించే వాళ్లమని అన్నారు. కానీ అక్కడ అంత తక్కువ మంది హాజరుకావడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. ఆ జనాన్ని చూసి రాహుల్ పైపైన మాట్లాడి వెళ్లిపోయారు.. అని పేర్కొన్నారు.

వాయిదా వేస్తూ వచ్చి ఆఖరుకు..

పార్టీ అధికారంలోకి ఉన్న రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమానికి ఐదు లక్షల మంది సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాల్సి ఉండగా.. ఇలా చేయడం ఏంటని ఆయా మంత్రులు వారిలో వారు ఒకరితో ఒకరు గుణుగుణుకున్నట్లుగా సమాచారం. రాహుల్? కోసమే గిగ్ వర్కర్ల కార్యక్రమాన్ని ఇన్నాళ్లు వాయిదా వేశామని, తీరా ఆయన వచ్చాక ఇలా జరిగిందేంటి? అంటూ నిట్టూర్చారు. కార్యక్రమానికి జన సమీకరణపై కాంగ్రెస్?కీలక నేత, ప్రభుత్వ కీలక నేత ఇరువురు కూడా తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. 'అంతా నేను చూసుకుంటానని, తనకు వదిలేయాలని తమతో అన్నారని, తాము కూడా ఆయన మీద భరోసాతో ఊరుకున్నామని, కానీ ఇలా చేస్తారని అనుకోలేదని' ఓ ప్రభుత్వ పెద్ద కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం.

మంత్రులనే అనుమతించరా?..

చివరికి కార్యక్రమ వేదికపైకి ఎక్కే వారి జాబితాలో ఆ శాఖ మంత్రి పేరు తప్ప మిగిలిన వారి పేర్లు లేవని సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మొదట మంత్రులను సైతం వేదికపైకి అనుమతించలేదని తెలిసింది. ఆ తరువాత రాహుల్, సీఎం వచ్చాకే మంత్రులను వేదిక మీదికి అనుమతించారని పార్టీ నాయకుల ద్వారా తెలిసింది. దీంతో పలువురు మంత్రులు ఆశ్చర్యపోయినట్లుగా సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పేర్లు ఇవ్వరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. కొందరు మంత్రులు అవమానకరంగా భావించినట్లుగా తెలిసింది.

యాదగిరిగుట్ట నరసింహుని దర్శించుకున్న 83 వేల మంది భక్తులు

ఇది కద నిజం,యాదగిరిగుట్ట: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ మొదలై రాత్రి వరకు కొనసాగడంతో, సుమారు 83 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత దర్శన క్యూ కాంప్లెక్స్‌తో పాటు మూడు వెయిటింగ్ హాళ్లు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. సాధారణంగా ఇంతటి రద్దీ సమయంలో 7 నుంచి 8 గంటల సమయం పట్టే దర్శనాన్ని, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు ఆలయ మరియు ఎస్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో 3 నుంచి 4 గంటల లోపే కల్పించారు. రెండు క్యూ మార్గాల ద్వారా భక్తులను అనుమతించడంతో ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.

మొత్తం భక్తులలో రూ. 150 ప్రత్యేక దర్శనం ద్వారా 9,037 మంది, బ్రేక్ దర్శనం ద్వారా 1,722 మంది, మిగిలిన 72,241 మంది ధర్మదర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. మరోవైపు, శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో ప్రధాన ఆలయంలో 1,204 మంది, పాతగుట్ట ఆలయంలో 110 మంది కలిపి మొత్తం 1,314 మంది భక్తులు పాల్గొన్నారు. వ్రత మండపాల వద్ద ప్రసాదాల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టగా, దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్య అన్నప్రసాద వితరణలో సుమారు 2,500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని క్షేత్రంలోని శివాలయంలో శ్రీ స్పటిక లింగ స్పర్శ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు కల్పించారు. స్పటిక లింగ దర్శనం అనంతరం భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరిగుట్ట వైష్ణవ క్షేత్రంగానే కాకుండా శైవ క్షేత్రంగానూ విశేష ప్రాశస్త్యం కలిగి ఉన్నందున, నరసింహస్వామి దర్శనానంతరం శ్రీ పార్వతీ వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారిని కూడా దర్శించుకుని ఉభయ దైవాల కృపకు పాత్రులు కావాలని దేవస్థానం భక్తులకు విజ్ఞప్తి చేసింది.

ఇదిలా ఉండగా, కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున దేవస్థానం అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూ లైన్ల నిర్వహణ, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత విభాగాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. భక్తులకు త్వరితగతిన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక విధులు నిర్వహించనున్నారు.

స్వర్ణగిరిలో వైభవంగా

శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్య కళ్యాణోత్సవం

తిరువీధి ఉత్సవంతో పులకించిన భక్తజనం

ఇది కద నిజం,స్వర్ణగిరి: పవిత్ర కార్తీక మాసం శుక్ల పక్ష షష్టి, ఆదివారాన్ని పురస్కరించుకుని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్యోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రాతఃకాలంలో అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ, అనంతరం గోపృష్ఠ దర్శనం చేయించారు. ఉదయం 5:45 గంటలకు బంగారు బావి నుండి సువర్ణ బిందె తీర్థాన్ని తీసుకువచ్చి స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారిని మణిమయ స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా జరిపించారు.

కార్తీక మాస ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా ఆలయంలోని అష్టలక్ష్మి మండపంలో కార్తీక దామోదర హవనమును, వైభవ మండపంలో శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు పట్టు పీతాంబరాలు, సుగంధభరిత పుష్పమాలలతో అలంకృతులైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవోత్సవ మండపంలో మంగళ వాయిద్యాల మధ్య కన్నులపండువగా జరిపించారు. ఈ వేడుకను తిలకించిన భక్తులు ఆనందపరవశులయ్యారు. ఆలయ నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా ఈరోజు 3,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సాయంత్రం సంధ్యా సమయంలో ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తిశ్రద్ధలతో 'మోక్ష నారాయణ దీపాన్ని' వెలిగించారు. అనంతరం సాయంత్రం 6:30 గంటలకు మేళతాళాలు, మృదంగ మంగళ ధ్వనులు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీ వేంకటేశ్వర స్వామివారి తిరువీధి ఉత్సవం మాడవీధులలో శోభాయమానంగా సాగింది. తిరువీధి సేవ ముగిసిన తర్వాత దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులైన స్వామివారికి అర్చకులు వేదమంత్రాలతో పూజలు చేసి కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఈ నయనానందకర దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని తరించారు.

రేవంత్ రెడ్డితో అంటకాగుతున్నది మీ నాయకులే

హరీశ్ రావుపై ఆరోపణలు వచ్చిన ప్రతిసారి ఆర్ఎస్ ప్రవీణ్ స్పందించడం వెనుక మర్మమేమిటి?

సిద్దిపేటలో కల్వకుంట్ల కవిత చూపించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమైన్ లో ఉన్నవే

అబద్ధపు ప్రచారాలతో అబద్ధాలు ఎప్పటికీ నిజం కాలేవు

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుల మండిపాటు

ఇది కద నిజం ,హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డితో అంటకాగుతున్నది బీఆర్ఎస్ నాయకులే అన్న వాస్తవాన్ని ఆ పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తించాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్ సూచించారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జి డాక్టర్ చిట్నేని రఘు, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్ చార్జీ చింతల రాజలింగం, తుంగతుర్తి ఇన్ చార్జి సూరారపు కృష్ణవేణి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పడాల మనోజాగౌడ్, నేషనల్ మీడియా స్పోక్స్ పర్సన్ ఎంఏ అశ్వక్ తదితరులు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. నవీన్ మాట్లాడుతూ, ప్రతినిత్యం ప్రజల కోసం పని చేస్తున్న కల్వకుంట్ల కవితను రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాకనే రేవంత్ రెడ్డి వెనుక ఉండి టీఆర్ఎస్ ను నడిపిస్తున్నారనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డితో అంటకాగుతున్నది బీఆర్ఎస్ లోని ముఖ్య నేతలే అన్న విషయాన్ని ఆ పార్టీ నాయకత్వం గుర్తించాలన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ చెప్పిన కంపెనీ ఒక్క రూపాయి వ్యాపార లావాదేవీలు కూడా చేయకుండానే మూత పడిందని గుర్తు చేశారు. ఈ విషయంపై కవిత గతంలోనే స్పష్టత ఇచ్చినా రేవంత్ రెడ్డితో వ్యాపార సంబంధాలు ఉన్నాయనే తప్పుడు ఆరోపణలు పదే పదే చేస్తున్నారని మండిపడ్డారు.

మల్లన్నసాగర్ సిస్మిక్ జోన్ లో ఉన్నదనే విషయాన్ని నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ (ఎన్ జీఆర్ఐ) పరిశోధన చేసి చెప్పిందని.. ఈ డాక్యుమెంట్ పబ్లిక్ డొమైన్ లో ఉందని తెలిపారు. ఇదే విషయమై అనేక పర్యాయాలు రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా నిర్వహించి చర్చించారని గుర్తు చేశారు. మల్లన్నసాగర్ నిర్మాణం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని, భూకంపాలు వచ్చే ప్రమాదం.. ప్రభావంపై ఎలాంటి సర్వేలు చేయకుండానే 50 టీఎంసీల భారీ రిజర్వాయర్ నిర్మించారనే విషయాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తమ నివేదికలోనూ ప్రస్తావించారని తెలిపారు. కాగ్ నివేదిక పబ్లిక్ డొమైన్ లో సింగిల్ క్లిక్ తో దొరుకుతుందనే వాస్తవం ఐపీఎస్ అధికారిగా పని చేసిన ప్రవీణ్ కు తెలియదా అని ప్రశ్నించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్, దానికి నీటిని తరలించే పంపుహౌస్ లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ డిపార్ట్ మెంట్ ఏడాదిన్నర క్రితమే నివేదిక సమర్పించినా దానిని రేవంత్ రెడ్డి బయట పెట్టకపోవడానికి హరీశ్ రావుతో ఆయనకు ఉన్న లాలూచీ రాజకీయాలే కారణమని తెలిపారు. అయినా ఆ నివేదికను సీఎం పంపి కవితతో మాట్లాడించాడు అని ఆర్ఎస్ ప్రవీణ్ అనడం ఆయన మానసిక స్థితికి అద్దం పడుతుందన్నారు.

కొండపోచమ్మ సాగర్ లో అక్రమాలకు పాల్పడిన హరీశ్ రావు సన్నిహిత ఈఎన్సీలు మురళీధర్, హరిరామ్ సహా 28 మంది ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ డిపార్ట్మెంట్ రికమండ్ చేసిందని తెలిపారు. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తో పాటు మరికొన్ని కాంట్రాక్టు సంస్థల నుంచి రూ.263.54 కోట్లు రికవరీ చేయాలని కూడా విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. కవిత బహిర్గత పరిచిన విజిలెన్స్ రిపోర్ట్ అనేక మీడియా సంస్థల ప్రతినిధుల దగ్గర ఉందనే విషయాన్ని మరిచిపోయి ఆ నివేదిక కూడా కవిత ద్వారా సీఎం బయట పెట్టించాడు అని చెప్పడం ఆర్ఎస్ ప్రవీణ్ అవివేకానికి నిదర్శనమన్నారు. హరీశ్ రావు అవినీతిని, గత ప్రభుత్వం చేసిన అవినీతిని కల్వకుంట్ల కవిత బయట పెట్టడాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ వ్యతిరేకిస్తున్నారా? గత ప్రభుత్వంలో అసలు అవినీతి జరగలేదని చెప్పదలుచుకున్నారా అనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వాలన్నారు. ఒకవేళ గత ప్రభుత్వంలో అవినీతి జరగలేదని చెప్పడమే ఆయన ఉద్దేశమైతే బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎందుకు ఆరోపణలు చేశారో ఆర్ఎస్ ప్రవీణ్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

నిమ్స్ లో హెల్త్ మినిస్టర్ గా చేసిన అక్రమాలను సైతం ఆ హాస్పిటల్ ఫ్యాకల్టీ, జీపీఎఫ్ హోల్డర్స్ అసోసియేషన్ కవితకు లేఖ రాసిందని.. అదే లేఖను కవిత సిద్దిపేట మీడియా సమావేశంలో ప్రదర్శించడంతో పాటు మీడియాకు రిలీజ్ చేశారని తెలిపారు. నిమ్స్ లో అక్రమాలపై నివేదిక కూడా కవితకు ఇచ్చి సీఎం మాట్లాడించారు అని ఆర్ఎస్ ప్రవీణ్ చెప్పడం వెనుక అనేక కుట్రలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఐపీఎస్ అధికారిగా తెలంగాణ ఉద్యమకారుల రక్తం కళ్ల చూసినప్పుడు కూడా హరీశ్ రావుతో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కలిసే ఉన్నారా అనే అనుమానం కలుగుతుందన్నారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి కాబట్టే మాజీ మంత్రిపై ఆరోపణలు వచ్చిన ప్రతిసారి ఆర్ఎస్ ప్రవీణ్ రియాక్ట్ అవుతున్నారని అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా వందలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు మాయమాటలు చెప్పి తన వెంట తిప్పుకున్న ప్రవీణ్ కుమార్ తన స్వార్థం కోసం వాళ్లందరిని వదిలేసి బీఆర్ఎస్ చేరారని తెలిపారు. ఎంపీ టికెట్ సహా పక్కా ప్యాకేజీ మాట్లాడుకునే నీలి రంగు కండువా తీసేసి గులాబీ రంగు కండువా కప్పుకున్నారని.. ఈ మొత్తం వ్యవహారం వెనుక కూడా హరీశ్ రావు ఉన్నట్టుగా అనిపిస్తోందని అన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. ఆడబిడ్డ ఏడ్చిన పార్టీ బాగుపడవనే విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ధైర్యం ఉంటే కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలే తప్ప ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్ కుట్ర రాజకీయాలను ప్రజలు నమ్మరు

రచ్చ శ్రీనివాస్ బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్

ఇది కద నిజం :హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమిట్ ముగింపు సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరియు భారతీయ జనతా పార్టీపై చేసిన నిరాధార ఆరోపణలను బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిని ఓర్వలేక రాహుల్ గాంధీ పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ గౌతమ్ అదానీ దేశాన్ని చెరబట్టారంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని దశాబ్దాల పాటు దేశాన్ని దోచుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ చేసింది కాంగ్రెస్సే 2014లోనే ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది అని రాహుల్ గాంధీ అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని రచ్చ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ వ్యవస్థలను అణచివేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు.అభివృద్ధిపై అసూయ కాంగ్రెస్ వైఖరి పారదర్శకమైన టెండర్ల ప్రక్రియ ద్వారా మౌలిక సదుపాయాలు విమానాశ్రయాలు పోర్టుల అభివృద్ధి జరుగుతుంటే దానిని రాజకీయం చేయడం తగదన్నారు .నేడు భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుండటాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు

న్యాయవ్యవస్థపై గౌరవం లేక తనపై 45 కేసులు పెట్టారని రాహుల్ గాంధీ సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని చట్టం ముందు అందరూ సమానమేనని దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. కరువుతో తెలంగాణ ప్రజలు అల్లాడుతుంటే దృష్టి మళ్లించేందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి సభలు పెట్టి కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని రచ్చ శ్రీనివాస్ ఆరోపించారు.ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వాన్ని నియంతృత్వం అనడం ప్రజాతీర్పును అవమానించడమేనని రాహుల్ గాంధీ తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హోంనగర్ కాలనీ హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా–నీరుడు సర్వేష్ ముదిరాజ్

ఇది కద నిజం,రాజేంద్రనగర్,కిస్మత్‌పూర్: కిస్మత్‌పూర్ 122వ డివిజన్ పరిధిలోని హోంనగర్ కాలనీలో కొలువై ఉన్న శ్రీ హనుమాన్ ఆలయ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్ తెలిపారు.

ఆలయ పరిసరాల అభివృద్ధితో పాటు, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పెద్దవంగర మండల కుమ్మరి సంఘం నూతన కమిటీ ఎన్నిక

మండల కన్వీనర్‌గా రాయరపు రాజు, కో కన్వీనర్‌గా కొలిపాక అనిల్ ఎన్నిక

పెద్దవంగర, 15 నవంబర్ (ఇది కద నిజం): పెద్దవంగర మండల కుమ్మరి సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కన్వీనర్ అలువల ఉపేందర్, కో కన్వీనర్ సముద్రాల సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈ కమిటీ ఎన్నిక నిర్వహించారు.

సందర్భంగా పెద్దవంగర మండల కన్వీనర్‌గా రాయరపు రాజు, కో కన్వీనర్‌గా కొలిపాక అనిల్, మహిళా సంఘం విభాగం కన్వీనర్‌గా రాయరపు కనకమ్మను ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా పగిడిపాల రమేష్‌ను నియమించారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా గంగాధరి మురళి, పాలవెల్లి సోమన్న, రాయరపు స్వామి, రాయరపు నగేష్, కోరేపు సోమన్న, గంగాధరి సాయి తదితరులను ఎంపిక చేశారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం

ఇది కద నిజం, నిజామాబాద్ జిల్లా నవంబర్ 15 పిట్లం: కుమ్మరి కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్మించిన భూలక్ష్మమ్మ, పాపమ్మ ఆలయాల ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి కుమ్మరి సాయిలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 1,11,000 భారీ విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యుడు బత్తిని జగదీష్‌కు అందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించడం పట్ల కాలనీ వాసులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కుమ్మరి సాయిలును అభినందించారు.























































సినిమా న్యూస్

మాస్ హీరోతో

టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్‌కు రంగం సిద్ధమైంది. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి కలిసి ఓ భారీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని అందించబోతున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ.. 'మా తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించడం గర్వంగా ఉంది.. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి ఒక పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని అందించబోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా నవ్వుల విందు కోసం సిద్ధంగా ఉండండి' అంటూ ఫొటోలు పంచుకున్నారు ప్రజెంట్ ఇందుకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వైరల్ అవుతుండగా.. సినీ అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. అంతే కాకుండా.. #NTRxAnilRavipudi హ్యాష్‌ట్యాగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

ఒకవైపు తన అద్భుతమైన నటన, మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న ఎన్టీఆర్.. మరోవైపు కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వరుస విజయాలు అందుకుంటున్న అనిల్ రావిపూడి చేతులు కలపడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. ముఖ్యంగా అనిల్ రావిపూడి సినిమాల్లో ఉండే వినోదం, ఎన్టీఆర్ కామెడీ టైమింగ్ కలిస్తే థియేటర్లలో నవ్వుల సందడి ఏ స్థాయిలో ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా కథ, నటీనటులు, షూటింగ్ వివరాలు, విడుదల తేదీ వంటి అంశాలపై ఇంకా అధికారిక సమాచారం రావాల్సి ఉంది. ఎన్టీఆర్‌ను అనిల్ రావిపూడి కలయికలో సినిమా వస్తే బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సందడి ఉంటుందో అంటూ కామెంట్స్‌తో రచ్చ చేస్తున్నారు ఫ్యాన్స్.

ఓటీటీలోకి 'క్రేజీ కళ్యాణం'

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, సీనియర్ నటుడు నరేశ్ వీకే, దర్శకుడు కమ్ నటుడు తరుణ్ భాస్కర్, అఖిల్ ఉద్దమూరి ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. దర్శకుడు భద్రప్ప గాజుల పెళ్లి అనే ఆసక్తికరమైన పాయింట్ చుట్టూ నడిచే వినోదాత్మక సన్నివేశాలతో ఈ సినిమాను తెరకెక్కించారు. అక్టోబర్ 16న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించి మంచి వినోదాన్ని అందించింది. ఇక థియేటర్లలో సందడి చేసిన ఈ కామెడీ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది.

థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ఫ్యామిలీ ఆడియన్స్, ఓటీటీ ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండగా తాజాగా, అధికారిక ప్రకటన వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ తెలుగు ఓటీటీ సంస్థ ఆహా సొంతం చేసుకుంది. నవంబర్ 20 నుంచి ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. అనుపమ, తరుణ్ భాస్కర్, నరేశ్‌ల కామెడీ టైమింగ్‌తో రూపొందిన ఈ 'క్రేజీ కళ్యాణం' నవంబర్ 20 నుంచి ఇంట్లోనే నవ్వుల పండగ తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది.

CMR SHOPPING MALL
PRESENTS
WORLD DIGITAL PREMIERE
CRAZY కళ్యాణం
TELUGU | TAMIL
PREMIERES 20TH NOV
24 HOURS EARLY ACCESS ON aha GOLD
EXPERIENCE IN
Dolby Atmos

'జనతా'!

మెగా ఫ్యామిలీ నుంచి ఇప్పటికే ఎంతోమంది హీరోలు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, తమదైన నటనతో మంచి సక్సెస్ అందుకుంటూ దూసుకుపోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి సోదరుడి కుమారుడిగా పరిచయమైన యంగ్ హీరో పవన్ తేజ్ కూడా ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. తాజాగా, ఆయన తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. తిరుగుబాటు నేపథ్యంలో రూపొందుతున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాకు 'జనతా' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్, దానికి జత చేసిన క్యాప్షన్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేశాయి. యుద్ధం రాముడితో కాదు రాజ్యంతో.. తిరుగుబాటు జ్వాలలు రగిలాయి అంటూ ఇచ్చిన క్యాప్షన్ సినిమా కథ ఎంత ఇంటెన్స్‌గా ఉండబోతుందో స్పష్టం చేస్తోంది. ఈ చిత్రానికి రాజశేఖర్ యాదవ్ దర్శకత్వం వహిస్తుండగా, వసుంధర ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందులో పవన్ తేజ్ సామాన్య ప్రజల హక్కుల కోసం, అన్యాయంపై తిరుగుబాటు చేసే ఒక శక్తివంతమైన యువకుడి పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.

VAE VASUNDHARA ARTS
యుద్ధం రాముడితో కాదు రాజ్యం తో
KONIDELA PAVAN TEJ in
JANTA
STORY - SCREENPLAY - DIRECTION
RAJASEKHAR YADAV
PRODUCERS
RAJESH GUNISETTI - VEERU YADAV

మళ్లీ తెరపైకి వస్తా

తెలుగు ప్రేక్షకులను తన కామెడీ టైమింగ్‌తో కడుపుబ్బా నవ్వించిన చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ గురించి ప్రస్తుతం ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తల్లి చివరి కోరికను నెరవేర్చడం కోసం ఆయన సినిమాలకు గుడ్ బై చెప్పి డాక్టర్‌గా స్థిరపడాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే తాజాగా ఈ ప్రచారంపై భరత్ స్పందించి క్లారిటీ ఇచ్చాడు. నేను నటనకు గుడ్ బై చెబుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదుని భరత్ స్పష్టం చేశారు. సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని, మంచి కథలు, తనకు నచ్చే విభిన్నమైన పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తానని తెలిపారు. ప్రస్తుతం సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించడంతో.. పుకార్లకు చెక్ పెట్టినట్లు అయింది.

కాగా.. బాలనటుడిగా 'రెడీ', 'ఢీ', 'వెంకీ', 'పోకిరి', 'కింగ్' వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు భరత్. సుమారు 80కి పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఇక భరత్ తల్లి కమలాసిని కోరిక మాత్రం తన కుమారుడు డాక్టర్ కావాలనేది. ఆమె ప్రోత్సాహంతోనే భరత్ వైద్య విద్యపై దృష్టి పెట్టారు. 2025లో ఆమె మరణించినప్పటికీ, ఆమె ఆశయాన్ని నెరవేర్చే దిశగా భరత్ ఎంబీబీఎస్ పూర్తి చేశారు.

బిగ్‌బీ ఇంటిపై కాల్పులకు స్కెచ్!

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ముంబై నివాసం వెలుపల కాల్పులు జరిపేందుకు పన్నిన భారీ కుట్రను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ భగ్నం చేసింది. ఈ కేసుకు సంబంధించి పంజాబ్‌కు చెందిన ఇద్దరు షార్ప్ షూటర్లు వికాస్ ఠాకూర్ అలియాస్ విక్కీ (జలంధర్), దీపక్ సింగ్ అలియాస్ దీప్ (తరన్‌తారన్)ను పోలీసులు అరెస్ట్ చేశారు. విదేశాల్లో తలదాచుకున్న ఓ గ్యాంగ్‌స్టర్ ఆదేశాల మేరకు వీరిద్దరూ పనిచేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల సమయంలో అమితాబ్ బచ్చన్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై ఆగ్రహంతో ఉన్న విదేశీ గ్యాంగ్‌స్టర్, ఆయన ఇంటి వద్ద కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురి చేయాలని పథకం రచించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, తాను ఎప్పుడూ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని అమితాబ్ బచ్చన్ గతంలోనే స్పష్టం గా ఖండించారు.

అక్టోబర్ 3న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగిన ప్రముఖ ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ 'మ్యాడ్ సంధు' హత్య కేసులో దీపక్ సింగ్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఆ హత్య తర్వాత ముంబైకి పారిపోయి తలదాచుకున్న దీపక్‌ను.. మరికొంత కాలం అక్కడే ఉండి అమితాబ్ బచ్చన్ ఇంటి పై కాల్పులు జరపాలని విదేశాల్లోని హ్యాండ్లర్లు ఆదేశించారు. అలాగే మరో నిందితుడు వికాస్ ఠాకూర్ ఢిల్లీలోని ఓ వ్యాపారి వద్ద డబ్బులు వసూలు చేసేందుకు, అతనిపై కాల్పులు జరిపేందుకు ఢిల్లీకి రాగా స్పెషల్ సెల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వికాస్‌ను విచారించగా ముంబైలో ఉన్న దీపక్ సింగ్ గురించి, అమితాబ్ ఇంటి పై కాల్పుల ప్లాన్ గురించి సంచలన విషయాలు బయటపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు ముంబై పోలీసుల సహకారంతో దీపక్‌ను కూడా అరెస్ట్ చేశారు. నిందితులపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు, విదేశీ గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు.